క్లుప్తంగా

దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ అనంతరం పూజలు చేశారు. అనంతరం పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో విజయవాడ పైపులరోడ్డుకు చెందిన మహేష్ నృత్యాలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం కళావేదికపై గురువారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం దాసరి మహేష్ పర్యవేక్షణలో శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. నృత్య ప్రదర్శనలో ఆరుగురు చిన్నారులు అద్భుతమైన ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులను ఆలయ డీఈవో రత్నరాజు అభినందించి దేవస్థానం తరుపున ప్రశంసాపత్రం, అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

పేదలకు దుస్తులు పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ కొబ్బరితోట జీసస్‌ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో గురువారం సాయంత్రం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీఎఫ్ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం క్రిస్మస్ సందేశం వివరించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. ఏసుక్రీస్తు ప్రజల పాపాలను హరించటానికి రక్తం చిందించారని తెలిపారు. తోటివారికి సాయం చేయటం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. అనంతరం నిరుపేదలకు నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే నిరుపేదలు, విశ్వాసకులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు పాల్గొని ఏసుక్రీస్తు ప్రార్థనలు చేసి ప్రేమవిందు స్వీకరించారు. కార్యక్రమంలో బి.విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

రేపు సిద్ధార్థ ఆడిటోరియంలో నృత్య ప్రదర్శన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సిద్ధార్థ ఆడిటోరియంలో క్షీర సాగర మథనం కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన శనివారం నిర్వహించనున్నామని సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన చావలి బాలా త్రిపుర సుందరీ బృందంలోని సభ్యులు ఈ కూచిపూడి నృత్య రూపక ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. దుర్వాస మహర్షి శాపం కారణంగా స్వర్గానికి అధిపతి అయిన ఇంద్రుడు, ఇతర దేవతలు శక్తిహీనులై మహావిష్ణువుని శరణు వేడగా ఆయన సూచన మేరకు క్షీరసాగర మథనం చేసి దాని నుంచి ఉద్భవించిన అమృతాన్ని సేవించి పునఃశక్తివంతులు కావడం, దానవులు మోహినిని పట్టుకోడానికి ప్రయత్నించగా శ్రీమహావిష్ణువు తన స్వరూపాన్ని పొందటం వంటి సన్నివేశాలను ప్రదర్శిస్తారని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఈ ప్రదర్శనను ఉచితంగానే వీక్షించవచ్చన్నారు.

మధురంగా సాగిన భక్తి గీతాలు



విజయవాడ కల్చరల్: సెమీ క్రిస్మస్ సందర్భంగా సునీల్ ఆర్కెస్ట్రా ఈవెంట్స్ ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన భక్తి గీతాల కార్యక్రమం మధురంగా సాగింది. గాయకుడు సునీల్ ఆధ్వర్యంలో గాయనీ గాయకులు బి.అశోక్, రాజా, లక్ష్మణ్ నాయక్, డాక్టర్ భాగ్యశ్రీ,రజని, మహేశ్వరి క్రీస్తుని స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, వివిధ రంగాలకు చెందిన చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, జీవన్ వెంకట్రావ్, డీవీ వీరభద్రరావు, ముష్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై వ్యాపారం..రోడ్లపైనే పార్కింగ్

- కుంచించుకుపోతున్న రోడ్లు
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రోడ్డు మార్జిన్ వరకు ఉన్న దుకాణం..రోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానిపురంలోని క్రాంబే రోడ్డులో కొందరు దుకాణదారులు ఫుట్‌పాత్‌పై వరకు దుకాణాన్ని నిర్వహిస్తుండగా, కొందరు వాహనదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు విస్తీర్ణం కుంచించుకుపోయి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో పాదచారులు, వాహనదారులు అవస్థలుపడుతున్నారు.

రోడ్డు మార్జిన్లు ఆక్రమణ..

భవానిపురం క్రాంబే రోడ్డు రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. గతంతో పోలిస్తే ఈ రోడ్డులో వ్యాపార, వాణిజ్య దుకాణాలు రెట్టింపయ్యాయి. ప్రముఖ కంపెనీల ఔట్‌లెట్స్ వెలిశాయి. రోడ్డుకు ఇరువైపులా స్కూల్స్, కాలేజీలు ఏర్పాటయ్యాయి. వాహనాల సంఖ్య పెరిగి రద్దీ విపరీతంగా పెరిగింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గత ప్రభుత్వం రోడ్డును విస్తరించింది. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైయిన్లపై డస్ట్ ఫ్రీ పేపర్ బ్లాక్స్ వేసి చూడచక్కగా తీర్చిదిద్దింది. సైడ్ మార్జిన్లు వ్యాపారానికి అనుకూలంగా ఉండటంతో రోడ్డు పక్కన ఉన్న దుకాణాల వారు తమ షాపులను ముందుకు విస్తరిస్తూ వస్తున్నారు. క్రాంబే రోడ్డు చర్చి సెంటర్ నుంచి స్వాతి సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రైయిన్లు, మార్జిన్లలో లెక్కకు మించి నూడిల్స్, ఫలూద, ఫ్రూట్స్, టిఫిన్ సెంటర్స్, జ్యూస్ సెంటర్స్ వెలిశాయి. చర్చి సెంటర్ నుంచి స్వాతి సెంటర్ వరకు ఉదయం, రాత్రి సమయంలో అడుగు తీసి అడుగు వేయడానికి వీల్లేకుండా రద్దీ ఉంటుంది. ఆ షాపుల వద్దకు వచ్చే వాహనదారులు తమ బైక్‌లు, కార్లు రోడ్డు మధ్యలోకి నిలిపి వేస్తున్నారు. దీంతో షాపులు ఫుట్‌పాత్‌లపై, వాహనాలు రోడ్డుపైన నిలిచిపోతుంటంతో అత్యంత వెడల్పు అయిన రోడ్డు సైతం తప్పుకునేందుకు వీలు లేకుండా కుంచించుకుపోతోంది. కొందరు దుకాణదారులు పోటీతో తమ దుకాణాలను డ్రైయిన్లు దాటి మార్జిన్ మీదకు విస్తరిస్తున్నారు. మరికొందరు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోగా , మరికొందరు ఏకంగా సొంత స్థలాల మాదిరి రూమ్‌లు నిర్మిస్తుండటం గమనార్హం.



పోలీసుస్టేషన్ రోడ్డులో దుకాణాలు మార్జిన్‌లోకి రావడంతో రోడ్డుపై పెట్టిన వాహనాలు

పెరుగుతున్న ప్రమాదాలు...

రోడ్డుకు ఇరువైపున ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద వాహనాలు రోడ్డుపైన పార్క్ చేస్తున్నారు. ఇక్కడ ఉన్న ఓ మాల్ ఎదురుగా రెండు నెలల క్రితం విజయ పాల వాహనం దూసుకుని షాపుల్లోకి వెళ్లింది. చర్చి సెంటర్ వద్ద చికెన్ పకోడి సెంటర్‌లోకి లారీ దూసుకెళ్లింది. వాహనాలు అడ్డదిడ్డంగా షాపులు ముందు నిలిపి వేయడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక పాఠశాలలకు వెళ్లే సమయంలోనూ, వచ్చే సమయంలోనూ విపరీతమైన రద్దీ ఉంటుంది. స్వాతి సెంటర్ జంక్షన్ వద్ద వాహనదారులకు ప్రత్యక్ష నరకంగా కనిపిస్తోంది. హైవే నుంచి క్రాంబే రోడ్డులోకి తిరిగే ప్రదేశంలో వాహనాలకు నియంత్రణ లేకుండా పోయింది.

పట్టించుకోని అధికారులు..

కళ్లెదుటే ఇంత జరుగుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. రోడ్డు పక్కన ఒక దుకాణం వాళ్లు ముందుకు జరిగితే మరో దుకాణం వాళ్లు ఇబ్బందులు పడుతూ...తరచూ గొడవకు దిగుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో చేసేది లేక మిన్నకుండిపోతున్నారు. ఇక ట్రాఫిక్ పోలీసులు ఒకటి రెండు చోట్ల తూతూ మంత్రంగా ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు తప్ప పూర్తిగా దృష్టిపెట్టడం లేదు. కనీసం రోడ్డు మధ్య వరకు నిలిపివేస్తున్న వాహనాలను తీయించడం లేదు.

బైపాస్ రోడ్డులో సితారా సెంటర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఖాళీ స్థలం ఉంది. ఇక్కడ స్థలానికి ఇసుక, మెటీరియల్ వ్యాపారులు వాడేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో మార్జిన్ లోపల్ ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేసి ... క్రాంబే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులను అక్కడికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు. ఇలా చేస్తే క్రాంబే రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీరుతుందని, చిరు వ్యాపారులకు ఇబ్బంది కలగదని స్థానికులు చెబుతున్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బాలికలకు ఉజ్వల భవిష్యత్ అందించేందుకు కృషి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కిశోర వికాసం ద్వారా బాలికలకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం కలెక్టర్ లక్ష్మీశ, మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విద్యార్థినులతో కిశోర వికాసం కార్యక్రమం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలను సాధికారత దిశగా నడిపేందుకు కృషి చేయాలన్నారు. విద్య, మానసిక ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పోషకాహారం, అక్రమ రవాణా, పోక్సో చట్టం, ఆత్మ రక్షణ, యోగ జీవనోపాధి వంటి అంశాలపై బాలికల్లో పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. బాలికల భవిష్యత్తును మెరుగుపరచడానికి కిశోర వికాసం ఒక మంచి అవకాశమన్నారు. బాలికలు పూర్తి స్థాయిలో సామర్థ్యాన్ని పెంచుకునేందుకు కిశోర వికాసం దోహదపడాలని పేర్కొన్నారు. మానసిక నిపుణుల సహకారంతో బాలికలు మానసిక ఆరోగ్యంగా ఉండేలా కృషి చేయాలని కోరారు. యోగా వలన కలిగే మానసిక ప్రయోజన గురించి వివరించి ప్రతిరోజు యోగాసనాలు చేసేలా చైతన్యవంతులను చేయాలని సూచించారు. కిశోర వికాసంపై లఘు చిత్రాల ప్రదర్శన, వర్క్ షాపులు, చర్చా గోష్టి వంటివి నిర్వహించాలని తెలిపారు. బాల్య వివాహ నిషేధ చట్టం - 2006, బాలల లైంగిక దాడి నుంచి రక్షణ చట్టం (పోక్సో) -2012 తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. మహిళాశిశు సంక్షేమ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. ఉమాదేవి మాట్లాడుతూ కిశోర వికాసం కార్యక్రమంలో మార్పు ట్రస్ట్ ఆధ్వర్యంలో మేరీ స్టెల్లా కళాశాల విద్యార్థినులు నిర్దేశించిన అంశాలపై ఆరు నెలల ఇంటర్న్ షిప్ చేస్తున్నారన్నారు. విజయవాడ, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఆయా అంశాలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. మార్పు ట్రస్ట్ డైరెక్టర్ ఆర్. సూయజ్, సైకాలజిస్ట్ శివ జ్యోతి, చేయూత సంస్థ ప్రతినిధి టి. కృష్ణకుమారి, స్వీయ రక్షణ నిపుణురాలు లక్ష్మి సామ్రాజ్యం, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, స్టెల్లా కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి: సీపీఐ



అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న దోనేపూడి శంకర్, ప్రజా సంఘాల నాయకులు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను చులకనగా మాట్లాడి అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరును పదేపదే వల్లించడం బదులుగా హిందూ దేవతలను స్మరిస్తే ఏడు జన్మల మోక్షం లభిస్తుందంటూ వ్యంగంగా మాట్లాడిన అమిత్‌షా చర్యలను నిరసిస్తూ జిల్లా దళిత హక్కుల పోరాట సమితి, చేతి వృత్తిదారుల సమాఖ్య సంయుక్తంగా పాత రాజరాజేశ్వరిపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ప్రతిభావంతునిగా పేరుగాంచి, దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్‌ను గౌరవించాల్సింది పోయి అగౌరవపర్చడం అమిత్‌షా ఆర్‌ఎస్ఎస్ భావజాలాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. అమిత్‌షా వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించి ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప మాట్లాడుతూ రాజ్యాంగంలోని సెక్యులర్, సోషలిజం పదాలు సైతం తొలగించాలని బీజేపీ కుట్ర చేస్తుందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆ పదాలు సబబు అయినవని, భారత ప్రజలకు ప్రయోజనకరమని వ్యాఖ్యానించిందని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరు కలసికట్టుగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి బుద్దారపు వెంకట్రావు, ప్రజా సంఘాల నాయకులు తాడి పైడయ్య, సంగుల పేరయ్య, దామోదరరావు, రాచాకుల శ్రీను, కొండపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

23న నగరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

- హాజరు కానున్న సీఎం చంద్రబాబు
- జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



ఏ ప్లస్‌కన్వెన్షన్ నందు ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరగంలోని ఏ ప్లస్ కన్వెన్షన్ హాల్లో ఈ నెల 23వ తేదీన సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సామూహిక క్యాండిల్ లైట్ కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేస్తారన్నారు. గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించే ఏ ప్లస్ కన్వెన్షన్‌ను ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త వెంకటేష్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. క్రైస్తవ మత పెద్దలు, చర్చి ఫాదర్లు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో వేడుకలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. వేడుకల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకలు జరిగే ప్రాంగణంలో వేడుకల ప్రాంగణంలో క్రిస్మస్ ట్రీ, స్టార్స్‌తో అందంగా అలంకరించాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన క్రై స్తవ మత పెద్దలు, వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులకు ప్రోటోకాల్ ప్రకారం సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రితో పాటు హై టీ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఆహ్వాన పత్రాలతో పాటు పాసులను అందజేయడం జరుగుతుందన్నారు. వేదికను పరిశీలించిన వారిలో మైనార్టీ శాఖ కమిషనర్ సీహెచ్ శ్రీధర్, క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్, స్వామిదాస్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, సమన్వయ కర్త ఇక్బల్ సాహెబ్, తహసీల్దార్ రోహిణిదేవి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులను నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడిగా పొలిమెట్ల శరత్‌బాబు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా షేక్ మస్తాన్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షునిగా తనబుద్ది చంద్రశేఖర్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షునిగా విశ్వనాధ రవి నియమితులయ్యారు.

కృష్ణా వర్సిటీ క్రికెట్ విజేత పీబీ సిద్ధార్థ



విజయవాడస్పోర్ట్స్: కృష్ణ యూనివర్సిటీ వెస్ట్ జోన్ అంతర కళాశాల క్రికెట్ పోటీల్లో పీబీ సిద్ధార్థ కళాశాల జట్టు విజయం సాధించింది. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నలంద కాలేజీ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్స్ లో ప్రత్యర్థి నలంద డిగ్రీ కాలేజీ జట్టుపై పీబీ సిద్ధార్థ కాలేజీ జట్టు 61 పరుగులు తేడాతో గెలిచి విన్నర్ ట్రోఫీని కై వసం చేసుకుంది. విజేత జట్టును పీబీ సిద్ధార్థ కాలేజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సెక్రటరీ లక్ష్మణరావు, కన్వీనర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ బాబురావు, డీన్ రాజేష్, క్రీడా విభాగాధిపతి కష్టారెడ్డి కళాశాల ప్రాంగణంలో గురువారం అభినందించారు.

సైన్స్ ఎక్స్‌పో ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులను పరిశోధన, అభివృద్ధి వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని ఐకానిక్ స్కూల్ డైరెక్టర్ వై.పార్థసారథి తెలిపారు. ఏలూరు రోడ్డులోని ఐకాన్ పబ్లిక్ స్కూల్లో సైన్స్ ఎక్స్‌పో ప్రారంభమైంది. మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, స్పేస్ ఎక్స్ ప్లోరేషన్, ఖగోళ శాస్త్రం, రక్షణ, సాంకేతిక రంగాలకు సంబంధించి 477 వర్కింగ్ మోడల్స్ ఎక్స్‌పోలో ఉంచారు. విద్యార్థులు ఆయా మోడల్స్ గురించి సందర్శకులకు వివరించనున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. 20, 21, 22 తేదీల్లో జరిగే ఎక్స్‌పోలో విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించినట్లు చెప్పారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధన దిశగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలకు ప్రాధాన్యమివ్వాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పారిశ్రామిక విధానాల కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక అనుమతులు తదితరాలపై చర్చించారు. ఈ ఏడాది జూలై 26 నుంచి డిసెంబర్ 19 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 151 దరఖాస్తులు రాగా, వీటిలో ఇప్పటికే 133 ఆమోదం పొందాయని పరిశ్రమల శాఖ అధికారులు వివరించారు. మిగిలిన దరఖాస్తులను కూడా నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పారిశ్రామిక అభివృద్ధి విధానం (2015-20), (2020-23),(2023-27) కింద ఎంఎస్ఎంఈ రంగానికి అందించే ప్రోత్సాహకాలపై ఆగస్టులో స్రూట్నీ కమిటీ సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశం 48 క్లెయిమ్‌లకు రూ. 2.21 కోట్లు, అదేవిధంగా డిసెంబర్ 18న జరిగిన సమావేశం 31 క్లెయిమ్‌లకు రూ. 3.82 కోట్లు మేర ప్రతిపాదనలు పంపగా.. వీటిపై తాజాగా చర్చించి డీఐఈపీసీ ఆమోదం తెలిపింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీపీవో పి.లావణ్య కుమారి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జి, పీసీబీ ఈఈ శ్రీనివాసరావు, ఫ్యాప్సియా ప్రతినిధి మురళీకృష్ణ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తుల రక్షణకు అండగా ఉండాలి



చైర్మన్ అజీజ్‌ను సత్కరిస్తున్న షకీల్‌షఫీ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైన అజీజ్ వక్ఫ్‌బోర్డు ఆస్తుల రక్షణకు అండగా ఉండాలని ఏపీ ముతావల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హాజీ కేఎం షకీల్ షఫీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వక్ఫ్‌బోర్డు రాష్ట్ర కార్యాలయంలో చైర్మన్‌ను అజీజ్‌ను రాష్ట్ర ముతావల్లీల సంఘ నాయకులు గురువారం కలిసి అభినందలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముతావల్లీలు, దర్గా కమిటీల సమస్యలను అజీజ్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం షకీల్‌షఫీ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ముతావల్లీలు ఎదుర్కొంటున్న సమస్యలను అజీజ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. గడువు ముగిసిన ముతావల్లీలకు అర్హత ఉంటే రెన్యువల్ చేస్తామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే అందరినీ కలుపుకొని కమిటీలు నియమించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు వివరించారు. కర్నూలులో వక్ఫ్‌బోర్డు రీజనల్ ఆఫీసు ఏర్పాటు చేయాలని కోరగా, న్యాయపరమైన సలహాలు తీసుకుని ఆ దిశగా ముందుకు వెళతామని చెప్పారన్నారు. వక్ఫ్ ట్రిబ్యునల్‌ను సక్రమంగా పనిచేసేలా చూస్తామని, దర్గాలు, మసీదులకు ఆదాయం వచ్చేలా వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు చట్టబద్ధంగా లీజుకు ఇచ్చే అంశాలను కూడా పరిశీలిస్తామని చైర్మన్ అజీజ్ హామీ ఇచ్చారని వివరించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించడం తప్పనిసరి



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పద్మాకర్

ఎన్టీఆర్ జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పద్మాకర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు కచ్చితంగా పాటించాలని ఎన్టీఆర్ జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పద్మాకర్ సూచించారు. మాచరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పద్మాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రోడ్లపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. రోడ్ సేఫ్టీ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు భద్రత నియమాలపై ఎంత అవగాహన కల్పించినప్పటికీ ప్రజలు వాటిని నిర్లక్ష్యం చేస్తున్నందున ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే భద్రత నియమాలపై అవగాహన పెంచుకోవటంతో పాటు తప్పక పాటించాలని సూచించారు. ఆర్టీవో ఆఫీస్ వైద్యులు డాక్టర్ తేజ సాయికిరణ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని మరి కొంతమంది అంగవైకల్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని తగ్గించడానికి ప్రజలకి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వారిని రక్షించేందుకు సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ సేవల గురించి పీపీటీ ద్వారా తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్ పాల్గొన్నారు.

నారీశక్తికి ప్రతీక అహల్యాబాయి



మాట్లాడుతున్న డాక్టర్ మంగాదేవి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతదేశ నారీశక్తికి ప్రతీకగా అహల్యాబాయి నిలిచిందని మారీస్ స్టెల్లా కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ వీఎస్ మంగాదేవి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఐసీసీ విభాగం ఆధ్వర్యంలో 'మన వారసత్వ స్ఫూర్తి రాణి అహల్యాబాయి' జీవిత చరిత్రపై కళాశాల ప్రాంగణంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంగాదేవి మాట్లాడుతూ మహారాణి అహల్యాబాయి అనేక స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలను నిర్వహించారన్నారు. మరాఠాలు పరిపాలించిన మాల్వా సామ్రాజ్యపు హెల్కారు వంశరాణి అహల్యాబాయి అని వివరించారు. వితంతువులకు భర్త ఆస్తి సంక్రమించేలా చేశారన్నారు. యుద్ధవిద్యలలో మహిళలను ఆమె ప్రోత్సాహించారని చెప్పారు. చెరువులు, కాలువల తవ్వించి వ్యవసాయ అభివృద్ధికి పాటుపడ్డారని వివరించారు. ఆమె నిర్వహించిన ఎన్నో కార్యక్రమాలు నాటి పాలకులకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ఆమె స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇండోర్‌లోని విమానాశ్రయానికి ఆమె పేరు పెట్టారన్నారు. ఆర్కిటెక్చర్, పరిపాలన, సామాజిక సంక్షేమానికి రాణి అహల్యాబాయి చేసిన సేవలు నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఐసీసీ విభాగ కన్వీనర్ డాక్టర్ ఏ రమాదేవి అధ్యక్షత వహించగా, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో మాక్ డ్రిల్ నిర్వహణ

గుణదల(విజయవాడ తూర్పు): విపత్కర పరిస్థితుల్లో భద్రతా చర్యలు తీసుకోవడంలో పోలీసులు, రైల్వే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సిఎస్‌డబ్ల్యూ డీసీపీ ఎస్వీడి ప్రసాద్ సూచించారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి ఆక్టోపస్, ఎన్టీఆర్ జిల్లా పోలీసు సంయుక్త ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులు, ప్రమాదాలు జరిగే సమయాల్లో పోలీసులు, రైల్వే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆక్టోపస్ ఏఎస్పీ రాజారెడ్డి, డీఎస్పీ బి.కృష్ణ, నార్త్ ఏసీపీ స్రవంతి రాయ్, సీఐ బాల రాజాజీ పాల్గొన్నారు.

డ్రైవింగ్ స్కూల్ ట్రైనీలకు సర్టిఫికెట్లు ప్రదానం

పటమట(విజయవాడ తూర్పు): ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ (విజయవాడ) మోడల్ డ్రైవింగ్ స్కూల్ (అంపాపురం)లో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 1078 వ బ్యాచ్ ట్రెయినీలకు సర్టిఫికెటలను అందించామని కృష్ణా జిల్లా లారీ యాజమానుల సంఘం అధ్యక్షుడు నాగుమోతు రాజా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యావేత్త చలువాది మల్లికార్జునరావు హాజరై సర్టిఫికెట్లు అందచేశారని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాలు నివారించాలంటే వాహన నియంత్రణ అవసరమని చెప్పారు. డ్రైవర్లు తగిన శిక్షణ తీసుకోవాలని సూచించారు. రాజా మాట్లాడుతూ రహదారి భద్రతకు లారీ ఓనర్ల సంఘం కట్టుబడి ఉందని చెప్పారు. ఉత్తమ డ్రైవర్లను సమాజానికి అందించేందుకు రూ.6 వేల నామమాత్ర రుసుముకే 32 రోజులపాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నామన్నారు. రక్తదానం చేసిన ట్రెయినీలకు కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు రావి గోపాలరావు ప్రశంసపత్రాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్ల సంఘం ఉపాధ్యక్షుడు కె. సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి అల్లాడ సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్ బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు పాల్గొన్నారన్నారు.